# నరాధముడు

—వీరపల్లె ఫణావాణి

**శీతాకాలం.** అందుకే ఆరు గంటలకల్లా ముదురు చీకట్లు ముసురుకుంటున్నాయి. నంధించిన బాణంలా ముందుకు దూసుకుని వెళుతున్న ఆ బ స్సులో నేను కిటికీ దగ్గర కూర్చు న్నాను. ఈదురు గాలితో చలి ఎముకల్ని కొరికేస్తూం ది.

"ఏమండీ! గొల్లగూడెం ఇంకా ఎంత దూరం ఉంటుంది?" అడిగాను నా పక్కన కూర్చున్న ఓ పెద్దమనిషిని.

"ఎంతో దూరం లేదు లెండి. పది నిమిషాల్లో వచ్చేస్తుంది.. మీరు గొల్లగూడెంలో దిగాలా?" అడి గా డా పెద్దమనిషి ఫ్లాడీ నోట్లో పెట్టుకుని వెలి గించుకుంటూ.

"అవునండి."


"ఆ ఊళ్ళో మీ కెవరైనా చుట్టా లున్నారా? ఇంతకూ మీ దే ఊరు?" ప్రశ్నించా డాయన.

"మాది నెల్లూరండి. నా స్నేహితు డొకడు గొల్లగూడెంలో ఉన్నాడు. నన్ను రమ్మని వాడు చాలా రోజులనుండి ఉత్తరాలు రాస్తుంటే చూ "సి వెళ్దామని వచ్చాను. ఈ ప్రాంతానికి నేను రావడం ఇదే మొదటిసారి." చెప్పాను.

"మీ స్నేహితుడు గొల్లగూడెంలో ఏం పని చేస్తుంటాడు?" మళ్ళీ అడిగా డాయన.

"వాడు డాక్టరండి. ఆ ఊళ్ళో ప్రయివేట్ ప్రాక్టీ "స చేస్తున్నాడు."

"పేరు?"



"దయాసాగర్." ఆ పేరు చెప్పగానే ఆయన ముఖం విప్పారడం నేను గమనించాను.

"దయాసాగర్‌గారా? వారు నాకు బాగా తెలుసండి. నిజంగా వారు సార్థక నామధేయులు. అంత ఉత్తములయిన డాక్టర్ని నేనెక్కడా చూళ్ళే'దంటే నమ్మండి. రోగి ఇచ్చినంత ఫీజును తీసుకుంటాడే తప్ప, ఆయన డబ్బుల కోసం రోగినెప్పుడూ పీడించడు.

డాక్టరంటే పునర్జన్మను ప్రసాదించే మరో బ్రహ్మ. మనువులలో ఉత్తముడు గదండీ. దయాసాగర్‌గారు వృత్తిరీత్యా నిజంగా ఉత్తములు. పేదల పట్ల దయ, సానుభూతి ఇంకా ఈ కలికాలంలో ఎంత మంది డాక్టర్ల కుంటుంది చెప్పండి" అంటూ ఆ పెద్దమనిషి దయాసాగర్ ఔన్నత్యం గురించి గొప్పగా చెప్పసాగాడు.

ఇంతలో బస్సు గొల్లగూడెం చేరుకుంది. నేను బ్రీఫ్‌కేస్ అందుకుని దిగేశాను. బస్సు వెళ్ళిపోయింది. నేనక్కడే నిలబడి చుట్టూ కలయ చూశాను.

గొల్లగూడెం పెద్ద టౌన్ కాదు. అలా అని అదో పల్లెటూరనికూడా చెప్పలేం. ఊళ్ళో ఓ సినిమా టెంటూ, రెండు రైస్ మిల్లులూ, రోడ్డుకు ఇరువైపులా టీ కొట్లూ, కొన్ని కాకా హొటల్సూ ఉండడం కనిపించాయి నాకు. ఇంతలో ఓ రిక్షావాడు నా దగ్గర కొచ్చి "ఎక్కడి కెళ్ళాలి, సార్" అని అడిగాడు.

"డాక్టర్ దయాసాగర్ గారింటికి..." చెప్పాను.

"అయితే ఎక్కండి, సార్. డాక్టర్‌గారి ఇల్లు ఊరవతల ఉంది." రిక్షావాడు నా బ్రీఫ్‌కేస్ అందుకున్నాడు. బేరం మాట్లాడి నేను రిక్షా ఎక్కి కూర్చున్నాను.

"డాక్టర్ దయాసాగర్ నీకు బాగా తెలుసా?" ఏదో ఒకటి మాట్లాడాలని రిక్షావాడిని అడిగాను.

"మీరు భలేవారు, సార్. డాక్టర్‌బాబుగారిని ఎరగని వాడు ఈ ఊళ్ళో ఎవడూ లేడండి. ఆ బాబుగారు నిజంగా దేవుడండి. ఆయనే లేకుంటే ఈ ఊళ్ళో మా బోటి పేదోళ్ళంతా రోగాలతో సచ్చిపోయుండేవాళ్ళు" అంటూ దయాసాగర్ దయార్ద్ర హృదయం గురించి పొగడసాగాడు రిక్షావాడు.

ఇందాకా బస్సులో ఆ పెద్దమనిషి... ఇప్పుడు ఈ రిక్షావాడు... వీళ్ళ మాటలు వింటుంటే నాకు మతి పోతూంది. 'వీళ్ళు చెబుతున్నది మా దయాసాగర్ గురించేనా?' అనే అనుమానం కలుగుతూంది నాకు. కారణం, దయాసాగర్ డబ్బు విషయంలో ఎలాంటి వాడో నాకు బాగా తెలుసు.

పిసినార్లలో ప్రథమ గణ్యుడు వాడు. పేస్టు కొంటే డబ్బు అయిపోతుందని చదువుకునే రోజుల్లో వాడు వేపపుల్లతోనే పళ్ళు తోముకునేవాడు. ఎప్పుడూ సెకండ్ క్లాస్ టికెట్ కొనుక్కునే ఆరు నెలల కో సినిమా చూసేవాడు.

ఉత్తరాలు రాయవలసి వస్తే కార్డు ముక్కలోనే రాసేవాడు. చివరకు బ్లేడ్సుకు ఖర్చు పెట్టడం ఎందుకని వాడు పది రోజుల కో సారి షేవింగ్ చేసేవాడు. అలాంటి ప్రఖ్యాతమైన పిసినిగొట్టు దయాసాగర్ గురించి నేనింత గొప్పగా వినడం... నా చెవుల్ని నేనే నమ్మలేక పోతున్నాను.

"డాక్టర్ గారిప్పుడు ఇంట్లో ఉండరు, సార్. ఈ టైమ్‌లో డిస్పెన్సరీలో ఉంటారు" అన్నాడు రిక్షావాడు.

"అలాగా! అయితే నేరుగా డిస్పెన్సరీ వద్దకే పోనీ" అన్నాను. పది నిమిషాల్లో ఓ పెంకుటింటి ముందు రిక్షా ఆగింది. రిక్షావాడికి డబ్బులిచ్చేసి నేను లోపలికి నడిచాను.

వరండాలో కొంతమంది బెంచీమీద కూర్చుని ఉన్నారు. మరి కొందరు నేలమీది చాపలపై కూర్చుని ఉన్నారు. వాళ్ళంతా పేషెంట్లని చూడగానే అర్థమైపోయింది నాకు. అంతేకాదు. దయాసాగర్ సంపాదనకూడా అంచనా వేసుకో గలిగాను.

"హాయ్, గిరి! ఏమిత్రా ఉత్తరం ముక్కయినా రాయకుండా ఉన్నట్టుండి ఊడిపడ్డావ్?" నన్ను చూడగానే ఆశ్చర్యంలోంచి తేరుకోలేకపోయాడు దయాసాగర్.

"నిన్ను సర్‌ప్రైజ్ చేద్దామని ఉత్తరంకూడా రాయకుండా వచ్చేశానోయ్."

"ఇన్నాళ్ళకు నేను గుర్తు కొచ్చానన్న మాట. వెరీగుడ్! కాంపౌండర్ని పంపిస్తాను. నువ్వు ఇంటి కెళ్ళు. అరగంటలో నేను డిస్పెన్సరీ మూసేసి వస్తాను."

"అరగంటే కదా. మిగిలిన పేషెంట్స్‌ను చూసెయ్. ఇద్దరం కలిసే ఇంటికి వెళ్దాం" అంటూ అక్కడున్న ఓ పాత పత్రికను అందుకుని పేజీలు తిప్పసాగాను.

వరండాలోంచి ఒక్కో పేషెంటే లోపలికి వస్తున్నారు. దయాసాగర్ వాళ్ళను టెస్టు చేస్తున్నాడు. ఏవో మందులు రాసి ఇచ్చి ఎదురుగా ఉన్న మెడికల్ షాప్ లోంచి కొనుక్కుని రమ్మని చెబుతున్నాడు. వాళ్ళకి ఇంజక్షన్స్ పొడుస్తున్నాడు. ఫీజు చాలా తక్కువ తీసుకుంటున్నాడు.

ముప్పావుగంట గడిచింది. చివరకు ఒక ముసలాడు మిగిలాడు. అతడేదో మందు సీసా మెడికల్ షాప్‌లోంచి కొనుక్కుని వచ్చి దయాసాగర్ కిచ్చాడు. వెంటనే దయాసాగర్ లోపలి గదిలోకి వెళ్ళి, రెండు క్షణాల్లో ఇంజక్షన్ లోడ్ చేసుకుని వచ్చి ఆ ముసలాడికి పొడిచాడు.

తరవాత ఆ ముసలాడు తన జేబులోంచి మూడు రూపాయలు తీసి తను చాలా పేదవాడని, అంతకన్నా ఎక్కువ ఫీజు ఇచ్చుకోలేనని చెప్పి, దయాసాగర్‌కు దండాలు పెట్టి అక్కడి నుండి వెళ్ళిపోయాడు.




"ఓ.కే. ఇక వెళ్దాం" అంటూ పైకి లేచి లోపలి గదిలోకి వెళ్ళి చేతులు కడుక్కో సాగాడు దయాసాగర్. వాడి వెంటే ఆ గదిలోకి నడిచిన నాకు, అక్కడో టేబుల్‌మీద చిన్న మందు సీసా కనిపించింది. చేతిలోకి తీసుకుని చూసిన నేను ఆశ్చర్యపోయాను. కారణం- ఇందాకటి ముసలాడు ఆ షాప్‌లోంచి కొనుక్కుని వచ్చిన మందు సీసా అది. ఇంకా సీల్ తియ్యలేదు.

"ఇదేమిత్రా! ఈ మందు సీసాను ఇందాకటి ఆ ముసలాడు కొనుక్కుని వచ్చినట్లుంది. సీల్ కూడా తియ్యలేదు. అయితే ఇందాకా నువ్వా ముసలాడికి ఇచ్చిన ఆ ఇంజక్షన్..." అంటూ దయాసాగర్ వేపు అయోమయంగా చూశాను.

"ఒరేయ్, గిరీ! ఇదొక పెద్ద దోపిడీ వ్యవస్థ. ఇందులో ఎవడికి వీలున్నంత వరకు వాడు దోచుకుంటున్నాడు. నేనూ అదే చేస్తున్నాను. అయితే ఈ దోపిడీ రహస్యంగా, నిర్విఘ్నంగా జరిగిపోతోంది. ఎవరు దోపిడీకి గురి అవుతున్నారో వాళ్ళు అమాయక జీవులు. అందుకే వాళ్ళు నిజం తెలుసుకో లేరు.

వాళ్ళు నిజం తెలుసుకోలేకపోవడమే నాకు కావలసింది. ఇందాకా ఆ ముసలాడు నాకు ఇచ్చిన ఫీజు కేవలం మూడు రూపాయలు. ఇది ఆ ముసలాడికీ, చూసేవాళ్ళకీ తెలిసిన విషయం. కానీ నిజానికి ఆ ముసలాడు నాకు ఇచ్చిన ఫీజు పన్నెండు రూపాయలు. ఇది చాల మందికి తెలియని విషయం.

ఆ ముసలాడికి ఇంజక్షన్ ద్వారా ఇచ్చిన మందు విలువ పదిహేను పైసలు. కానీ ఆ ముసలాడు ఎదుటి షాపులో కొనుక్కుని వచ్చిన ఈ మందు సీసా ఖరీదు తొమ్మిది రూపాయలు. ఇది చాలా ఖరీదైన మందు. ఈ సీసాలోని మందు ఒక్క ఇంజక్షన్‌కి మాత్రమే సరిపోతుంది. అయితే తను కొనుక్కుని వచ్చిన మందునే తనకు ఇంజక్ట్ చేశానని ఆ ముసలాడు అనుకుని ఉంటాడు.

ఈ మందు సీసాను నేను సీల్ తియ్యలేదు. కారణం- ఈ సీసా మళ్ళీ రేపటికల్లా ఎదురుగా ఉన్న మెడికల్ షాప్‌లోకి అమ్మకానికి వెళ్ళిపోతుంది. ఇందులో ఆ షాప్‌వాడికి కూడా కొంత వాటా ఉంటుంది. ఇది నా దోపిడీలోని ఒక భాగం మాత్రమే. అయినా ఇదంతా నీ కెందుకులే. పద" అన్నాడు దయాసాగర్.

వాడి మాటలు వింటూ నేను శిలలా బిగుసుకుపోయాను. ఈ దేశంలో అమాయకులైన ఈ ముసలివాడి లాంటి వాళ్ళు ఎందరో! దయాసాగర్ లాంటి డాక్టర్లు ఎందరో!

"డాక్టరంటే పునర్జన్మను ప్రసాదించే మరో బ్రహ్మ. మనువులలో ఉత్తముడు గదండీ!" బస్సులో నా పక్కన కూర్చున్న ఆ పెద్దమనిషి దయాసాగర్‌ను ఉద్దేశించి అన్న మాటలు నాకు గుర్తొచ్చాయి. 'వీడా... ఈ స్వార్థపరుడా నరోత్తముడు! కాదు. వీడు నరాధముడు... నీచుడు' అని మనసులో అనుకుంటూంటే దయాసాగర్ వెంట నడవటానికి నా కాళ్ళు మొండి కేశాయి. ★